ప్రజాశక్తి
శుక్రవారం 17 మే 2024
5
కర్నూలు

అభినందన సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ.గఫూర్

ఎవరి ధీమా వారిదే..

- గెలుపుపై అభ్యర్థుల్లో ఆశలు - 4న తేలనున్న భవితవ్యం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గెలుపుపై అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు. తాము ఎన్నికల్లో వ్యవహరించిన తీరే తమను గెలిపిస్తాదని నమ్మకంతో ఉన్నారు. అయితే జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది...

ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా సార్వత్రిక సమరంలో కీలకమైన పోలింగ్ ఘట్టం ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఇవిఎంలలో నిక్షిప్తమైంది. దీంతో ఎన్నికల్లో గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గెలుపుపై అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు. తాము ఎన్నికల్లో వ్యవహరించిన తీరే తమను గెలిపిస్తాదని నమ్మకంతో ఉన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అభ్యర్థుల ప్రచారం జోరుగా సాగింది. కుటుంబం మొత్తం గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. పార్టీల ఫిరాయింపులతో పాటు ఎత్తులకు పైఎత్తులు వేశారు. ఆయా పార్టీల అధినేతల పర్యటనల వేగం పెరిగింది. గెలుపుకోసం వైసిపి, టిడిపి నేతలు అనేక తంటాలు పడుతున్నారు. డబ్బు, మద్యం ఎర వేశారు. కర్నూలు పార్లమెంట్‌కు టిడిపి, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. కర్నూలులో టిడిపి, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులు పోటా పోటీ ప్రచారం నిర్వహించారు. కోడుమూరులో టిడిపి, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోయారు. ఎమ్మిగనూరులో టిడిపి, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోయారు. మంత్రాలయంలో టిడిపి, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరికి వారు ప్రచారంలో ముందుకు సాగారు. పత్తికొండలో టిడిపి, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోయారు. ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమిలో కలివిడి కరువైంది. ఆయా పార్టీల నాయకులు ఇతర పార్టీల నాయకులను కలుపుకుని వెళ్లడం లేదని అసంతృప్తి వ్యక్తం అవుతోంది. నంద్యాల పార్లమెంట్‌లో టిడిపి, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరికి వారు ప్రచారంలో ముందుకు సాగారు. నంద్యాల అసెంబ్లీలో టిడిపి, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారంలో ఎవరికి వారు ముందుకు సాగారు. ఆళ్లగడ్డలో టిడిపి, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులు, డోన్‌లో టిడిపి, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారంలో జోరుగా ముందుకు సాగారు. బనగానపల్లెలో టిడిపి, వైసిపి అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోయారు. నందికొట్కూరులో టిడిపి, వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరికి వారు ధీటుగా ముందుకు సాగారు. శ్రీశైలంలో టిడిపి, వైసిపి అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ నెలకొననుండగా కాంగ్రెస్ అభ్యర్థి గట్టి పోటీ ఇచ్చారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా గత ఎన్నికలతో పోలిస్తే ఏడు అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ శాతం పెరిగింది. మరో ఏడు అసెంబ్లీ స్థానాల్లో కొంత మేర తగ్గుదల కనిపించింది. గతేడాది ఉమ్మడి కర్నూలు జిల్లాలో 78.38 శాతం పోలింగ్ నమోదు కాగా ఈ సారి కర్నూలు జిల్లాలో 76.42 శాతం, నంద్యాలలో 81.12 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 20,54,563 మంది ఓటర్లు ఉండగా 15,70,007 మంది ఓటు వేశారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 13,72,091 మంది మొత్తం ఓటర్లు ఉండగా 11,13,040 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 83.96 శాతం, శ్రీశైలం నియోజకవర్గంలో 82.43 శాతం, నందికొట్కూరు నియోజకవర్గంలో 87.25 శాతం, కర్నూలు నియోజకవర్గంలో 58.96 శాతం, పాణ్యం నియోజకవర్గంలో 74.81, నంద్యాల నియోజకవర్గంలో 76.83, బనగానపల్లె నియోజకవర్గంలో 83.42 శాతం పోలింగ్ నమోదైంది. డోన్ నియోజకవర్గంలో 79.30 శాతం, పత్తికొండ నియోజకవర్గంలో 81.57, కోడుమూరు నియోజకవర్గంలో 77.68, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 79.65, మంత్రాలయం నియోజకవర్గంలో 85.18, ఆదోని నియోజకవర్గంలో 65.47, ఆలూరు నియోజకవర్గంలో 80.11 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 83.12 శాతం, శ్రీశైలం నియోజకవర్గంలో 81.70 శాతం, నందికొట్కూరు నియోజకవర్గంలో 81.69 శాతం, కర్నూలు నియోజకవర్గంలో 63.75 శాతం, పాణ్యం నియోజకవర్గంలో 74.44, నంద్యాల నియోజకవర్గంలో 75.00, బనగానపల్లె నియోజకవర్గంలో 82.29 శాతం పోలింగ్ నమోదైంది. డోన్ నియోజకవర్గంలో 82.91 శాతం, పత్తికొండ నియోజకవర్గంలో 84.98, కోడుమూరు నియోజకవర్గంలో 79.14, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 81.97, మంత్రాలయం నియోజకవర్గంలో 84.31, ఆదోని నియోజకవర్గంలో 66.55, ఆలూరు నియోజకవర్గంలో 80.73 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే పాణ్యం, మంత్రాలయం, ఆళ్లగడ్డ, శ్రీశైలం, నందికొట్కూరు, నంద్యాల, బనగానపల్లె నియోజకవర్గాల్లో కొంత మేర పోలింగ్ శాతం తగ్గింది. మిగిలిన ఏడు నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగింది. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం ఇవిఎంలలో నిక్షిప్తమైంది. జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఎవరు విజేతలు అవుతారో వేచి చూడాల్సిందే..

బలమైన వామపక్ష ఐక్యత చాటారు

- అభినందన సభలో ఎంఏ.గఫూర్, పి.మధు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సిపిఎం అభ్యర్థి గెలుపును కాంక్షిస్తూ అహర్నిశలు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ. గఫూర్, సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి మధు అభినందనలు తెలిపారు. గురువారం కర్నూలు నగరంలోని కల్లూరు హంద్రీ బ్రిడ్జి పక్కనున్న రావూరి గార్డెన్స్‌లో సిపిఎం అభ్యర్థి గెలుపునకు విస్తృత ప్రచారం చేసిన కార్యకర్తలకు అభినందన సభ సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి రాముడు అధ్యక్షతన నిర్వహించారు. సభను ఉద్దేశించి ఎంఏ గఫూర్, పి మధు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాణ్యం నియోజకవర్గ పరిధిలో బలమైన వామపక్ష ఐక్యత కొనసాగిందన్నారు. గెలుపు, ఓటములను పక్కన పెడితే నియోజకవర్గ పరిధిలో ప్రతి ఇంటికి ఎర్రజెండా గుర్తును బలంగా మూడు నాలుగు సార్లు తీసుకెళ్లారని అన్నారు. ఈ ఎన్నికలు పార్టీ ప్రచారంతో పాటు నిర్మాణయుతం గా బలపడటానికి మరింత తోడ్పడ్డాయన్నారు. సిపిఎంగా గత 25 సంవత్సరాల నుండి కర్నూలు అసెంబ్లీ పరిధిలో పోటీ చేస్తూ వచ్చామన్నారు. అయితే నేడు దేశంలో నెలకొన్న రాజకీయ పరిణామాల్లో భాగంగా మతోన్మాద బిజెపిని, దానికి అంట కాగుతున్న టిడిపి, జనసేనలను, నియంతృత్వ వైసిపిని ఓడించాలనే లక్ష్యంలో భాగంగా ఇండియా వేదిక పార్టీలతో కలిసి పోటీ చేశామన్నారు. కర్నూలులో కాంగ్రెస్ తమకు బలమైన వ్యక్తి ఉన్నారని చెప్పడంతో, ఇండియా వేదిక ఐక్యతను కాపాడడంతోపాటు పోటీ చేసే ప్రాంతాల్లో గెలవడం ముఖ్యం ఎవరు పోటీ చేయాలన్నది కాదు అని కర్నూలు నుండి పాణ్యం కు సిపిఎం మారాల్సి వచ్చిందన్నారు. తీరా కర్నూలు సీటును కాంగ్రెస్ కేటాయించిన తీరు చాలా బలహీనతను తెలియజేసిందన్నారు. కర్నూలు నుండి పాణ్యంకు సీటు మారినా రాజకీయ లక్ష్యం కలిగిన కమ్యూనిస్టు కార్యకర్తలుగా, ప్రజా సంఘాలుగా చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. అత్యంత తక్కువ సమయమే అయినా ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేశారన్నారు. పార్టీ గెలుపు కోసం ఎర్రని ఎండను సైతం లెక్కచేయకుండా ప్రతి నిమిషం విలువైనదే అంటూ కృషిచేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి, పాణ్యం అసెంబ్లీ అభ్యర్థి డి.గౌస్ దేశాయి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి. నిర్మల మాట్లాడుతూ చాలా తక్కువ సమయం ఉన్నా, 20 రోజుల్లోనే నియోజకవర్గం మొత్తం గొప్ప ప్రచారం నిర్వహించిన ప్రతి సభ్యునికి ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రచారంలో వాముపక్షాల ఐక్యత బలంగా కొనసాగడంతో పాటు, కార్మిక వర్గం అనుకున్నంత కంటే ఎక్కువ ఆక్కున చేర్చుకొని ప్రచారం నిర్వహించారన్నారు. ఎప్పుడైతే పొత్తుల్లో భాగంగా సీటు మారిందో.. మారిన అనంతరం కార్యకర్తల్లో కసి పెరిగి, కమ్యూనిస్టులను తక్కువ అంచనా వేస్తారా అంటూ రెట్టింపు పట్టుదలతో కృషి చేశారన్నారు. కషికి తోడైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రచారాన్ని విజయ వంతం చేసిన మనం అందరం కలసికట్టుగా నిర్మాణం కోసం మరింత కృషి చేయాలని, బలమైన పోరాటాలను నిర్వహించాల ని, దాని అనంతరం విజయం దానంతట అదే వస్తుందని తెలిపారు. అభినందన సభ ప్రారంభాని కి ముందు ప్రజానాట్యమండలి కళాకారులు పాడిన పాటలు, చేసిన కళా నృత్యాలు కార్యకర్తలను మరింత ఉత్సాహ పరిచాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, జి.రామకృష్ణ, కెవి.నారాయణ, బి.రామాంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు ఎండి.అంజిబాబు, ఎండి.ఆనంద్ బాబు, ఎస్.అలివేలు, ఎం.రాజ శేఖర్, వై.నగేష్, సి.గురు శేఖర్, ఇ.పుల్లారెడ్డి, ప్రజాసంఘాల నాయకులు అబ్దుల్లా, రాజు, కుమార్, సుభాన్‌తోపాటు వందలాది మంది కార్యకర్తలు హాజరయ్యారు.

హాజరైన నాయకులు, కార్యకర్తలు

స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత

- కలెక్టర్, ఎస్‌పి పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

స్ట్రాంగ్ రూముల వద్ద నియమించిన పోలీసు బలగాలు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఇవిఎమ్ యంత్రాలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లకు సంబంధించిన సిసి కెమెరాల లైవ్ ఫీడ్‌ను జిల్లా ఎస్‌పి కృష్ణకాంత్, జాయింట్ కలెక్టర్, పాణ్యం రిటర్నింగ్ అధికారి నారపు రెడ్డి మౌర్య తో కలిసి డాక్టర్ జి.సృజన పరిశీలించారు. కలెక్టర్ ముందుగా రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ బ్లాక్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం లో ఇవిఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను, సెక్యూరిటీ, కారిడార్లను కవర్ చేసేలా ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లో పార్లమెంట్, అసెంబ్లీకి సంబంధించిన స్ట్రాంగ్ రూమ్ లు 24 గంటలు స్క్రీన్‌లలో డిస్‌ప్లే అవుతూ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భద్రతా చర్యలు పటిష్ఠంగా ఉండాలని, పోలీసు అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కంట్రోల్ రూంకు షిఫ్ట్‌ల ప్రకారం నియమించిన రెవెన్యూ సిబ్బంది వివరాలను పోలీస్ అధికారులకు అందచేయాలని డిఆర్‌ఒను కలెక్టర్ ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత దృష్ట్యా విధులు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు, ఆర్మ్‌డ్‌రిజర్వ్ పోలీస్, స్థానిక పోలీస్‌కు తాగు నీరు, భోజన ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని డిఆర్‌ఒ, టిడ్కో ఎస్‌ఇలను కలెక్టర్ ఆదేశించారు. అసిస్టెంట్ ట్రైని కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్‌ఒ మధుసూదనరావు, కుడా వైస్ చైర్మన్, వెబ్ కాస్టింగ్ నోడల్ అధికారి ప్రతాప్‌రెడ్డి, టిడ్కో ఎస్‌ఇ రాజశేఖర్, ఎమ్మిగనూరు రిటర్నింగ్ అధికారి చిరంజీవి పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి

అభ్యర్థుల సమక్షంలో పరిశీలన : నగరంలోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూమును పోటీ చేసిన అభ్యర్థుల సమక్షంలో పరిశీలించారు. పాణ్యం ఎన్నికల రిటర్నింగ్ అధికారి నారపరెడ్డి మౌర్య పాణ్యం నియోజకవర్గానికి పోటీ చేసిన అభ్యర్థుల సమక్షంలో కళాశాలలోని ఇంటర్మీడియట్ స్ట్రాంగ్ రూం తెరిచి నాన్ స్టాచుటరీ కవర్స్ సార్టెట్ చేస్తున్న దృశ్యాలు పరిశీలన చేశారు.

పకడ్బందీగా డిగ్రీ సెమిస్టర్ పరీక్ష నిర్వహణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు వైస్‌ఛాన్సలర్ సుధీర్ ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 4 , ఆరవ సెమిస్టర్ పరీక్షలు గురువారం నుండి ప్రారంభమయ్యాయి. నగరంలోని స్థానిక సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో వైస్ ఛాన్సలర్‌తో పాటు వర్సిటీ రెక్టార్ ఎన్‌టికె. నాయక్ ఆకస్మికంగా పరిశీలన చేశారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పరీక్షలను నిర్వహించాలని నిర్వాహకులను ఆదేశించారు.

జబర్దస్త్ కళాకారులను అభినందిస్తున్న టిజి.వెంకటేష్ , పత్తిఓబులయ్య

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - కర్నూల్ కల్చరల్

లలిత కళాసమితి వేసవి వినోద సంబరాల్లో రెండో రోజు జబర్దస్త్ కళాకారుల సాంస్కృక కార్యక్రమాలను రాజ్యసభ మాజీ సభ్యులు టిజి. వెంకటేష్ ప్రారంభించారు. ఆయన 74వ జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. టిజివి మాట్లాడుతూ 50 యేళ్ల నుంచి కర్నూలు నగర అభివృద్ధికి వివిధ రకాలలో కృషి చేశానన్నారు. ఒకప్పుడు ఎంతో వెనుకబడిన కర్నూలు నగరం ఇవాళ ఈ స్థితిలో ఉండటానికి తనకృషి కొంత కారణమన్నారు. తనను కులం మతం పేరుతో వేరు చేయవద్దన్నారు. కర్నూలు వారందరూ తన బంధువులని అన్నారు. టిజివి కళాక్షేత్రంలో ప్రతివారం సాంస్కృతి కార్యక్రమం నిర్వహిస్తూ కర్నూలు నగరంలో ఒక ప్రత్యేక స్థానం పొందిందన్నారు. ఈ సందర్భంగా నాట్య శిక్షకులు రామకృష్ణ, కరిముల్లా, రోహిత్,సాయి ప్రదీప్‌లతోపాటు జబర్దస్త్ కళాకారులు అదిరేఅభి, వినోదిని, అదుర్స్ శేషు, ఇతర కళాకారులను ఆయన సత్కరించారు. పత్తి ఓబులయ్య స్వాగతం పలికి జబర్దస్త్ కళాకారులను పరిచయం చేశారు. వేదికపై జబర్దస్త్ కళాకారులు అనేక హాస్యపూరితమైన సన్నివేశాలను ప్రదర్శించారు. వాల్మీకి రాముడు, ఆర్జా రామకృష్ణ, మహమ్మద్ మియా పాల్గొన్నారు.

నేడు సర్వ సభ్య సమావేశం: ఎంపిడిఒ

ప్రజాశక్తి-సి బెళగల్ : సిబెళగల్ మండలంలో అభివృద్ధి పనులపైనా, చేయాల్సిన ప్రణాళిక పైనా శుక్రవారం సర్వసభ్య సమావేశంలో చర్చ ఉందని, అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలని ఎంపిడిఒ శకుంతల పేర్కొన్నారు.నివేదికలు వెంట తెచ్చుకోవాలని ఎవరైనా హాజరు కానిచో ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె హెచ్చరించారు.

24 గంటల విద్యుత్ అమలు : విద్యుత్ ఎఇ

ప్రజాశక్తి-మద్దికెర

రీయాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టర్ సిస్టం ద్వారా 24 గంటలు విద్యుత్తు అమలు చేస్తున్నట్లు విద్యుత్ ఎఇ రఫిక్‌ఖాన్ అన్నారు. మద్దికేరలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో గ్రామాలలో 24 గంటలు విద్యుత్ కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం గ్రామాలలో వన్‌ఫేస్ విద్యుత్ ఉందని, త్వరలో త్రీఫేస్ విద్యుత్ వస్తుందన్నారు. ఇప్పటికే మండల పరిధిలోని యడవలి బస్టాండ్ అడ్డా నుండి గ్రామంలోకి కొన్ని కరెంటు స్తంభాలను నాటినట్లు తెలిపారు. మిగతా గ్రామాలకు కూడా విద్యుత్ స్తంభాలను అతిత్వరలో లాగుతామని గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, కాంట్రాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

శిశువును కాపాడిన మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు

పజాశక్తి-కర్నూలు హాస్పిటల్: ఏడు నెలల శిశువు బెడ్ పై నుంచి పడిపోవడంతో మెరుగైన వైద్యం కోసం మెడికవర్ హాస్పిటల్స్ , కర్నూలుకు తెచ్చారు. పీడియాట్రిక్ వైద్యుల వివరాల ప్రకారం... బెడ్‌పై నుండి పడిపోవడంతో తలకు తీవ్రమైన గాయం అవ్వడంతో స్పృహ కూడా కోల్పోవడం, ఊపిరి తీసుకోవడం కష్టంగా మారింది. మెడికవర్ వైద్యులు తక్షణమే స్పందించి వెంటిలేటర్ పై ఉంచి , చికిత్స మొదలు పెట్టారు. సిటీ స్కాన్ తీయడం అందులో మెదడులో రక్తస్రావం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే శిశువును ఆపరేషన్ థియేటర్‌కు తరలించారు. జరిగింది. ఈ ప్రక్రియ జరుగుతూ ఉండగానే గుండె స్పందన నిలిచిపోవడం దానిని విజయవంతంగా పునరుద్ధరించారు. శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించి మెదడులోని రక్తస్రావంను తొలగించారు. ఈ ప్రక్రియ కేవలం గంటలోపల మాత్రమే నిర్వహించారు. శస్త్రచికిత్స తర్వాత కూడా శిశువుకు బిపి తగ్గిపోవటం, రక్త స్రావం, మూర్ఛలు రూపంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. డాక్టర్ కెఎస్.విశ్వకుమార్ , డాక్టర్ మురార్జీ నేతృత్వంలోని పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ టీమ్ 24/7 శిశువుకు చికిత్సఅందించడం వల్లకాపాడుకోగలిగాం. నాలుగు రోజుల తరువాత వెంటిలేటర్ తొలగించాం. బాబు ఎటువంటి న్యూరో డీసెబిలిటీస్ లేకుండా సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయ్యాడు. అనంతరం మెడికవర్ హాస్పిటల్స్ కర్నూలు క్లస్టర్ హెడ్ డాక్టర్ వై.మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటివి జరిగినప్పుడు ఎంత త్వరగా హాస్పిటల్‌కు తీసుకువస్తే (గోల్డెన్ అవర్లో) మనం కాపాడగలమన్నారు. సరైన సమయంలో సరైన వైద్యం, అత్యాధునిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన డాక్టర్స్ మెడికవర్ హాస్పిటల్స్ లో ఉండటం వల్ల ఈ రోజు ఈ శిశువును కాపాడగలిగామని అన్నారు.

శిశువుతో మెడికవర్ వైద్యులు

జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయం

పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ప్రజాశక్తి-పత్తికొండ

రాష్ట్రానికి ముఖ్యమంత్రి జగనన్న మళ్లీ కావడం ఖాయమని, పత్తికొండలో భారీ మెజార్టీతో గెలిచి వైసిపి జెండా ఎగరేస్తామని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి ధీమా వ్యక్తం చేశారు. గురువారం పత్తికొండ వైసిపి కార్యాలయంలో పత్తికొండ, తుగ్గలి, మద్దికేర వైసిపి నాయకులు కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనంలో శ్రీదేవి మాట్లాడారు. ఓటమి అసహనంతో టిడిపి నేతలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి వారికి దూరంగా ఉండాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. సొంత డబ్బులు కూడా ఖర్చు చేసి తన విజయం కోసం శ్రమించిన కార్యకర్తలను తాను ఎన్నటికీ విస్మరించనని సభాముఖంగా తెలిపారు. సొంత సోదరి పోటీలో ఉన్నట్టుగా భావించి నియోజకవర్గంలో ఎంతోమంది తన విజయం కోసం పనిచేశారని సంతోషం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద కుటుంబాన్ని ఇచ్చిన తన భర్త నారాయణరెడ్డిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి స్మరించుకున్నారు. నాలుగో తారీఖున ఫలితాలు వచ్చేవరకు ఎటువంటి పరిస్థితుల్లోనూ ఘర్షణలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో పత్తికొండ మాజీ ఎంపిపి నాగరత్నమ్మ , వైసిపి నాయకుడు బనగాని శ్రీనివాసులు,తుగ్గలి,మద్దికేర మండలాల ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ప్రమాదకరంగా పెద్దపాడు రహదారి

-నత్త నడకన డివైడర్ , రహదారి విస్తరణ పనులు -ప్రమాద హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు లేక ప్రమాదాలు

-కల్వర్టు వద్ద ఆటో బోల్తా పడి డ్రైవర్ అక్కడికక్కడే మృతి-ఇద్దరు ద్విచక్ర వాహనదారులకు గాయాలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నుంచి కోడుమూరు వెళ్లే జాతీయ రహదారి విస్తరణ పనులు గత మూడు నెలల క్రితం ప్రారంభమయ్యాయి. కర్నూలు నగర శివారు నుంచి పెద్దపాడు గ్రామం వరకు డివైడర్ నిర్మాణ పనులు కూడా చేపట్టారు. కాంట్రాక్టర్ పనులను త్వరితగతిన పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. కల్వర్టు విస్తరణ డివైడర్ యూటర్న్‌ల వద్ద నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నిలిచిపోయిన పనుల వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడం రాత్రి సమయంలో ప్రయాణించే వాహనదారులకు కనిపించేలా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయకపోవడంతో ఆయా ప్రాంతాలలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కర్నూలు శివారులో ప్రారంభం వద్దనే రేడియో స్టేషన్ సమీపంలో చేపట్టిన నిర్మాణాలు నిలిచిపోయాయి. ఇక్కడ ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టలేదు. మట్టి కుప్పలు నడిరోడ్డుపై పోశారు. రాత్రి సమయంలో ఆ కుప్పల వద్ద రేడియం స్టిక్కర్లు అతికించిన పోల్స్ స్తంభాలు పెట్టాల్సి ఉంది. ఇక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. లక్ష్మీనారాయణ కళ్యాణ మండపం వద్ద రాజీవ్ గృహకల్ప వద్ద డ్రైవర్స్ కాలనీ సమీపంలో నిలిచిన నిర్మాణ పనుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టలేదు. రాత్రి సమయంలో వీధిలైట్లు లేకపోవడంతో చీకటిలో ప్రయాణం చేస్తున్నా వాహనదారులకు పాత కల్వర్టుల సిమెంట్ దిమ్మెలు నడిరోడ్డుపైనే ఉండటంతో అవి కనిపించకపోవడంతో వాటిని ఢీకొట్టి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈనెల 6న పెద్దపాడు గ్రామానికి చెందిన నవీన్ ఆటో నడుపుతూ గ్రామానికి వస్తుండగా మట్టి కుప్ప పైకెక్కి బోల్తా పడింది. నవీన్ అక్కడికక్కడే మతి చెందాడు. కానిస్టేబుల్ ద్విచక్ర వాహనంపై రాత్రి వస్తుండగా కల్వర్టు దిమ్మెకు ఢీ కొట్టి గాయాల పాలయ్యాడు. ఈ ఘటనలో కానిస్టేబుల్‌కు కాలు విరిగింది. వారం క్రితం ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ కల్వర్టు వద్ద ప్రమాదానికి గురయ్యాడు తీవ్ర గాయాలై జిజిహెచ్ ఆసుపత్రిలో కోమాలో ఉంటూ చికిత్స పొందుతున్నాడు. ఇలా చెప్పుకుంటూ పోతే గత మూడు నెలల నుంచి అనేక ప్రమాదాలు జరిగాయని పెద్దపాడు గ్రామస్తులు, డ్రైవర్స్ కాలనీ, రాజీవ్ గృహకల్ప కాలనీవాసులు చెబుతున్నారు. కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు కొన్ని చోట్ల పెట్టి మరి కొన్ని చోట్ల పెట్టకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాత్రివేళ ప్రయాణించే వాహనదారులకు కల్వర్టు సిమెంట్ దిమ్మెలు కనిపించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు.

ప్రమాదానికి నిలయంగా ఆగిపోయిన కల్వర్టు పనులు

రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించండి

ఎం.మద్దిలేటి ఆటో డ్రైవర్ పెద్దపాడు

వెంటనే ప్రమాద హెచ్చరిక బోర్డులు స్టిక్కర్లు అతికించిన స్తంభాలు ఏర్పాటు చేయాలి. ఇప్పటికీ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నవీన్ మృతి చెందారు. ఇది ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతోనే జరిగింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాద హెచ్చరిక బోర్డులు రేడియం స్టిక్కర్లు అతికించాలి.

నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

వై. నగేష్ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

కర్నూలు నుంచి పెద్దపాడుకు వెళ్లే జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన కల్వర్టు డివైడర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. పనులను ఎక్కడికక్కడ నిలిపివేయడంతో గత మూడు నెలల నుంచి అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీసం రహదారులకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేయలేదు. రహదారిపై చీకట్లు ఉండడంతో నిలిచిన నిర్మాణపనుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

మంత్రాలయంలో కురుస్తున్న వర్షం

కురిసింది వాన...

- చల్లబడిన వాతావరణం

ప్రజాశక్తి - మంత్రాలయం

సూర్య ప్రతాపానికి ఉక్కిరిబిక్కిరయిన ప్రజలకు గురువారం కురిసిన వర్షంతో కొంత ఉపశమనం లభించింది. వాతావరణం కూడా చల్లబడింది. గురువారం స్థానికంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం వరకు ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు వర్షం కురవడంతో సంతోషం వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా నీరు లేక బోరుబావులు సైతం ఇంకిపోయి తాగునీటి సమస్య తీవ్రమైంది. వర్షాలు లేక తుంగభద్ర నది వెలవెలబోయింది. మండలంలో గత వారం రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర నదికి నీరు చేరుకోవడంతో కొంత జలకళ సంతరించుకుంది. నదికి నీరు రావడంతో భక్తులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈసారైన వర్షాలు సమృద్ధిగా కురిస్తే పంటలు సాగు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గర్భిణీకి రక్తదానం

- స్కూల్ కమిటీ ఛైర్మన్ బాలప్ప మానవత్వం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో విరుపాపురం గ్రామానికి చెందిన నిండు గర్భిణీ సుజాతకు పెద్దహరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ యు.బాలప్ప గురువారం రక్తదానం చేసి గొప్ప మనస్సును చాటుకున్నారు. ఒక్క ఫోన్ చేయగానే 'నేనున్నాన'ంటూ వెంటనే స్పందించి వచ్చి రక్తదానం చేశారు. ఈ విధంగా ముందుకొచ్చిన రక్తదాతకు సుజాత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కుప్పలదొడ్డి మల్లప్ప, కుప్పలదొడ్డి రాజా పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న బాలప్ప

అప్పవరకట్టి పుణ్యక్షేత్రంలో బివి

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని ఇబ్రహీంపురం గ్రామంలో ప్రసిద్ధిగాంచిన అప్పవర కట్టి పుణ్యక్షేత్రాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి గురువారం దర్శించుకున్నారు. అనంతరం టిడిపి కార్యలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత కొన్ని నెలలుగా టిడిపిని, తనను గెలిపించడానికి కృషి చేసిన టిడిపి మండల నాయకులకు, కార్యకర్తలకు, జనసేన, బిజెపి నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహాయ, సహకారాలతో, ప్రజల దీవెనలతో చంద్రబాబు ముఖ్యమంత్రి కాబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకు మండలంలో 80 శాతానికిపైగా పోలింగ్ కావడమే నిదర్శనమన్నారు. దేశాయ్ నెట్‌వర్క్ అధినేత, టిడిపి మండల నాయకులు గురురాజ్ దేశాయ్, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఖాసీంవలీ, సత్య రెడ్డి, మాజీ సర్పంచి రామన్న గౌడ్, నాగలదిన్నె యువ నాయకులు సలీం, దేశాయ్ యూత్ అధ్యక్షులు సాధిక్, ఈరన్న గౌడ్, డానియేల్, ఇజ్రాయేల్, అజయ్, అనిల్, సజీవ, గారకాయల రవి, సత్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బివి

రోడ్డుకు మోక్షమెప్పుడో..?

- అసంపూర్తిగానే రోడ్డు
- రైతులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణ శివారులోని జగనన్న కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారు. రోడ్డు నిర్మాణం చేపట్టి మధ్యలోనే ఆపేశారు. కాలనీకి అన్ని వసతులూ కల్పిస్తామని పాలకులు చెబుతూనే ఉన్నారు. అక్కడ ఇళ్ల నిర్మాణాలు చేపట్టారే తప్ప ఎలాంటి సదుపాయాలూ కల్పించలేదు. వసతులు కల్పించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు.

ఆదోని పట్టణ శివారులోని మండగిరి పంచాయతీ పరిధిలోని ఢణాపురం రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో సుమారు 9 వేల గృహ నిర్మాణాలు మొదలు పెట్టినట్లు అప్పట్లో అధికారులు తెలిపారు. లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో ఓ కంపెనీకి నిర్మాణాల బాధ్యతను ప్రభుత్వం అప్పజెప్పింది. కొన్ని లెంటల్ వరకు నిర్మాణాలు జరిగాయి. దాదాపు నేలమట్టంలోనే నిలిచిపోయాయి. ఆ కాలనీకి రాకపోకలు సాగించేందుకు ఆదోని నుంచి ఇఎస్ఐ ఆస్పత్రి రైల్వే గేటు మీదుగా రోడ్డు నిర్మాణం మొదలుపెట్టారు.

అసంపూర్తిగానే రోడ్డు

రైల్వే ట్రాక్ నుంచి జగనన్న కాలనీ వరకు బిటి రోడ్డు నిర్మాణానికి అధికారులు అప్పట్లో ఏర్పాట్లు చేశారు. రోడ్డు పనులు ప్రారంభంలో బిటి రోడ్డు కూడా వేయిస్తామని చెప్పారు. మట్టి తవ్వి రోడ్డుపై కంకర మాత్రమే వేసి వదిలిపెట్టారు. కంకర కారణంగా రోడ్డులో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఉంది. ఇళ్ల నిర్మాణాలు చూసేందుకు వెళ్తున్న లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. బైక్‌పై, సైకిల్‌పై వెళ్లేవారు కంకరలో అదుపు తప్పి కింద పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. హడావిడిగా రోడ్డు తవ్వి ఇలా అసంపూర్తిగా వదిలేయడం ఏమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. గ్రాంట్ అంతా వాడి పనులు నిలిపివేయడం ఏమిటని, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

రైతులకు ఇబ్బందులు

గతంలో మట్టి రోడ్డు ఉండడం వల్ల ఎద్దుల బండ్లపై, సైకిల్‌పై రైతులు పొలాలకు రాకపోకలు సాగించేవారు. రోడ్డు వేసే సమయంలో నల్లమట్టి వేయడం, దానిపై కంకర వేయడం వల్ల అప్పుడే అక్కడక్కడ రోడ్డు కుంగిపోయింది. కనీసం రోడ్డు రోలర్‌తోనైనా చదును చేయకుండా నాసిరకంగా పనులు చేసి, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని పలువురు విమర్శిస్తున్నారు. పనులకు సంబంధించిన బిల్లును డ్రా చేసుకొని వదిలేయడం ఏమిటని, అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆ రోడ్డు చదును పనులు చేయించి రాకపోకలు సజావుగా సాగేలా చూడాలని కోరుతున్నారు.

జగనన్న కాలనీకి వెళ్లే రహదారి దుస్థితి

సాయిప్రసాద్ రెడ్డి గెలుపు తథ్యం

- మండగిరి మాజీ సర్పంచి శేషిరెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

నియోజక వర్గంలో సెట్టింగ్ ఎమ్మెల్యే, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.సాయిప్రసాద్ రెడ్డి 30 వేల మెజారిటీతో గెలుస్తారని మండగిరి మాజీ సర్పంచి శేషిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడుసార్లుగా ఎమ్మెల్యేగా పని చేసి పట్టణంలో అభివృద్ధిని పరుగులు పెట్టించారని తెలిపారు. ఐదేళ్ల వైసిపి హయాంలో మెడికల్ కళాశాల, బైపాస్ రోడ్డు నిర్మాణం, ఐటిఐ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీలు, సచివాలయాలు, ఆర్‌బికెలు ఏర్పాటు చేయడంలో ప్రత్యేక చొరవ చూపారన్నారు. వరుసగా మూడోసారి కూడా గెలిచి సాయి ప్రసాద్ రెడ్డి హ్యాట్రిక్ కొడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. జూన్ 4న జరిగే కౌంటింగ్‌లో సాయిప్రసాద్‌రెడ్డికి 30 వేల మెజార్టీ వస్తుందని తెలిపారు.

స్వర్ణమయమైన రాఘవేంద్రుని బృందావనం

- భక్తుల కోలాహలం - భోజనశాల వద్ద భక్తుల అవస్థలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి మూలబృందావనం స్వర్ణమయమై భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం స్థానిక శ్రీమఠంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చన, పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణ కవచాలతో, పట్టు వస్త్రాలతో, పుష్ప హారాలతో అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్ర స్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూల బందావనాన్ని దర్శించుకొని నైవేద్య సమర్పణతో మంగళ హారతులిచ్చారు.

భోజనశాల వద్ద బారులుతీరిన భక్తులు

భక్తుల కోలాహలం

రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. స్వామి వారి దర్శనం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు చేశారు. అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి సేవాదారులతో పల్లకోత్సవం నిర్వహించారు.

భోజనశాల వద్ద భక్తుల అవస్థలు

రాఘవేంద్రస్వామి దర్శనార్థం మంత్రాలయం వచ్చిన భక్తులు భోజన శాల వద్ద అవస్థలు పడ్డారు. సార్వత్రిక ఎన్నికల ముగిసిన నేపథ్యంలో రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. దర్శనం అనంతరం స్వామి వారి ప్రసాదం కోసం భక్తులు భోజన శాల వద్ద బారులు తీరారు. భోజన శాల వద్ద గేటు తెరవకపోవడంతో క్యూలైన్ నిండిపోయి బయట రోడ్డుపై కూర్చునే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి సమయంలో భోజన శాలకు వృద్ధులు, వికలాంగులకు మరో ప్రత్యేక ద్వారం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని భక్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

రోడ్డుపై కూర్చున్న భక్తులు

తాగునీటి సమస్యతో ఇబ్బందులు

- పట్టించుకోని అధికారులు - సిఐటియు నాయకులు గోవిందు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిఐటియు నాయకులు పి.గోవిందు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసేందుకు అధికారులు సిద్ధపడ్డారని తెలిపారు. ప్రజలు విషయం తెలియక నీరు వచ్చిన రోజు వివిధ రకాల పనుల్లో ఉండడం, రోజువారీ కూలీలు, కార్మికులు, కర్షకులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పట్టణంలో ప్రధానంగా స్లమ్ ఏరియాలో ఊరికి చివరన ఉన్న ప్రాంతాల్లో ప్రజలు ఏ రోజు నీళ్లు వదులుతారో తెలియక తికమక పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నీళ్ల ఏరోజు, ఏ ప్రాంతానికి వస్తాయనే విషయం తెలియజేయాలని కోరారు. ఎన్నికల్లో పోటీ చేసిన టిడిపి, వైసిపిలు పోలింగ్ అయిన వెంటనే ప్రజలను మరిచిపోయారని విమర్శించారు. ఓటు వేసేంత వరకు ప్రజలను నమ్మించి ఓటు వేయించుకున్న తర్వాత రోజు మరిచి రోజు నీళ్లు ఇవ్వడం మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. గతంలో వేసవి రాకముందు పట్టణానికి సరిపోయే నీరు నిల్వ చేశామని మున్సిపల్ కమిషనర్ ప్రకటించారని తెలిపారు. ఇప్పుడేమో రోజు విడిచి రోజు నీరు ఇస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలు తాగడానికి కనీసం నీరు కూడా ఇవ్వరా అని అధికారులను నిలదీశారు. మున్సిపల్ కమిషనర్ పట్టణానికి ప్రణాళిక ప్రకారం నీరందించాలని కోరారు.



ప్రశాంతంగా ఎపి ఇఎపి సెట్ పరీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎపి ఇఎపి పరీక్షలు గురువారం నుండి ప్రారంభమయ్యాయి. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయసంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో ఇఎపి సెట్ పరీక్ష జరిగింది. మొత్తం ఈ పరీక్షకు19606 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. గురు, శుక్రవారాల్లో అగ్రికల్చరల్ , ఫార్మసీకి సంబంధించిన పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 18 నుండి 23 వరకు ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించిన పరీక్ష జరుగుతుందని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కర్నూలు నగరంలోని రాయలసీమ వర్సిటీలో నిర్వహించిన పరీక్షను వర్సిటీ వైస్ ఛాన్సలర్ సుధీర్ ప్రేమ్ కుమార్ పరిశీలన చేశారు.

వేసవి దుక్కులు.. లాభాలు దక్కు...

- అదునులోనే అప్రమత్తమైతే బహుళ ప్రయోజనాలు
- లోతైన దుక్కులతో భూసారం మెరుగు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

'దున్నకుండా సాగు చేస్తే.. కొయ్యకుండా పోతుంది..!' అనేది తెలుగు నానుడి. ఏ పంట వేయాలన్నా ముందు గా దుక్కి దున్నాల్సిందే. విత్తేందుకు, నాటేందుకు అనుకూలంగా పొలాన్ని సిద్ధం చేసుకోవాల్సిందే. దుక్కి దున్నకుండా వదిలేయ డం వల్ల భూమి సత్తువ కోల్పోతుంది. చీడపీడలకు ఆవాసంగా మారుతుంది. ముడి పోషకాల లోపం ఏర్పడి, తర్వాతి పంటకు ఎరువులు భారీగా వేయాల్సి వస్తుంది. అందుకే వేసవిలో రైతులు లోతైన దుక్కులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

దుక్కులు దున్నుతున్న రైతు

పంట పొలాల్లో వేసవి దుక్కుల వల్ల దిగుబడులకు ఎంతో మేలు కలుగుతుంది. కలుపు యాజమాన్య ప్రక్రియను వేసవి నుంచే చేపడితే కలుపు మందులను ఆశ్రయించకుండా రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులపై దృష్టి సారించడానికి వీలుంటుంది. భూమిని లోతైన దిక్కులు దున్నడం వల్ల మిగిలిపోయిన కలుపు మొక్కలను పూర్తిగా నాశనం చేయవచ్చు. శనగ, మిరప, మినుము, పెసర, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు పూర్తయిన తర్వాత మిగిలిన కలుపు మొక్కలు తొలకరి వర్షాలకు అధికంగా విత్తనోత్పత్తి చేసుకుంటాయి. వేసవిలో తప్పనిసరిగా లోతైన దిక్కులు దున్నాలి. ఇలాంటి దుక్కుల వల్ల భూమిలో ఉన్న కీటకాల గుడ్లు, లార్వాలు చనిపోవడంతో పాటు గడ్డి జాతులు తుంగ, గరికను అరికట్టవచ్చు. భూమిలోని పోషకాలు కూడా పెరిగి, పంట దిగుబడి బాగా వస్తుంది. లోతు దిక్కులతో నేలను చదును చేయడమే కాకుండా వేసవిలో వచ్చే జల్లులు, తొలకరి వర్షాలను ఉపయోగించుకొని నేల అవసరాన్ని బట్టి పైపొరల్లోని కలుపు విత్తనాలు కూడా మొలక దశలోనే నశింపజేస్తాయి. ఇతర కలుపు జాతులైన చిప్పర, గిరంగి, నేల ఉసిరి తదితర మొక్కలు లోతు దుక్కులతో నశిస్తాయి. ఆరుతడి పంటగా వరి సాగు చేసినప్పుడు పత్తి, మిరప, మొక్కజొన్న, మినుము, పెసర తదితర పంటల సాగుకు ముందే వేసవిలో లోతు దుక్కులు దున్నుకోవాలి.

• భూసార పరీక్షలు తప్పనిసరి

ప్రతి రైతూ వారి వారి పొలంలో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. ఈ భూసార పరీక్షల వల్ల భూమిలోని పోషక విలువలు తెలియడంతోపాటు పంటల దిగుబడులకు అవసరమైన ఎరువులను ఏ మోతాదులో వాడాలో తెలుస్తుంది. తద్వారా పంట సాగు ఖర్చులు కూడా తగ్గుతాయి.

• మూడు రకాలుగా

వేసవి దుక్కులను లోతుగా, వాలుకు, అడ్డంగా దున్నుకోవాలి. వాలుకు అడ్డంగా దున్నుకోవడం వల్ల వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. భూమి కూడా ఎక్కువ తేమను గ్రహిస్తుంది. నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. వేసవి దుక్కులకు ముందు పొలంలో గొర్రెలు, పశువుల మందలు తోలడం వల్ల వాటి విసర్జక వ్యర్థాలు సేంద్రీయ ఎరువుగా మారి భూమిలోకి చేరుతాయి. భూసార వృద్ధికి తోడ్పడతాయి. గత పంటకు సంబంధించిన ఆకులు, మొదళ్లు, చెత్తాచెదారం నేల పొరల్లో కలిసిపోయి, ఎరువుగా మారతాయి. రాబోయే పంటకు కావాల్సిన పోషక పదార్థాలను అందిస్తాయి.

• నాణ్యమైన దిగుబడులు

ప్రస్తుత పరిస్థితుల్లో పొలాలను చదును చేసి సేంద్రీయ ఎరువులు చల్లుకోవాలి. తొలకరికి ముందే లోతు దుక్కులు దున్నుకొని, పొలాలను సాగుకు సిద్ధం చేసుకోవాలి. వర్షాధార మెట్ట వ్యవసాయంలో వాతావరణ అవరోధాలు, భూసారం, కలుపు సమస్యలు, సంప్రదాయ పద్ధతులు లాంటి అవరోధాలు దిగుబడిని దెబ్బ తీస్తాయి. రైతులు ఎప్పటికప్పుడు సరికొత్త మెళకువలు పాటిస్తేనే అధిక దిగుబడులు పొందవచ్చు.

• దుక్కులు పూర్తయిన తర్వాత

దుక్కుల అనంతరం పిల్లి పెసర, జనుము, జీలుగ పచ్చిరొట్ట పైర్లుగా పొలంలో వేయడం వల్ల భూసారం పెరిగే అధిక దిగుబడులు లభిస్తాయి. ఖరీఫ్ సీజన్‌లో పండించే వరికి రబీ సీజన్‌లో పండించే మినుములు, పెసర, మొక్కజొన్న, తెల్ల జొన్న పంటల్లో చీడ పీడలను తట్టుకునే శక్తి ఈ పచ్చిరొట్ట పైర్లు వేసిన పొలాల్లో ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ప్రతి ఆర్‌బికె ద్వారా సబ్సిడీ మీద పచ్చిరొట్ట పైర్లు అందుబాటులో ఉన్నాయి.

• వేసవి దుక్కులతో కలుపు నివారణ

కలుపు మొక్కలు, ఇతర గడ్డి జాతి మొక్కలు భూసారాన్ని త్వరగా గ్రహించి ప్రత్యక్షంగా నష్టం కలిగిస్తాయి. పరోక్షంగా చీడ పీడలకు ఆశ్రయమిచ్చి పంట నష్టానికి దోహదమవుతున్నాయి. బహు వార్షిక మొండి జాతి కలుపు మొక్కలైన తుంగ, గరిక, దర్భ, జమ్ము లాంటి సమస్యాత్మక కలుపు మొక్కలు అన్ని రకాల భూముల్లో, వివిధ పంటల్లో పెరిగి పంట మొక్కలతో పోటీ పడి సమస్యాత్మకంగా తయారవుతాయి. వీటి వేర్లు, దుంపలు, కాయలు నేల లోపలి పొరల్లోకి విస్తరించి ఉండడంతో నివారణ కష్టమవుతుంది. బహు వార్షిక మొండి జాతి కలుపు మొక్కలను పైపైన దున్నడం వల్ల పూర్తిగా నివారించలేము. లోతు దుక్కులతో తుంగ, గరిక లాంటి మొండి జాతి కలుపు మొక్కల వేర్లు, దుంపలు భూమిపైకి వచ్చి వేసవిలో ఉండే అధిక సూర్యరశ్మికి గురై నశిస్తాయి. నేల పైకి వచ్చిన వేర్లు, దుంపలు ఏరివేయడం ద్వారా వీటిని అరికట్టవచ్చు. వీటితో పాటు ఇతర గడ్డి జాతి మొక్కలు, ద్విదళబీజ జాతి మొక్కల విత్తనాలు కూడా బయటపడి అధిక ఉష్ణోగ్రతల ద్వారా నశిస్తాయి. తర్వాత పంట కాలంలో కలుపు మందులకు, ఇతర క్రిమిసంహారక మందులకు వెచ్చించాల్సిన పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుంది.

• చీడ పీడల నివారణ

సాధారణంగా పంట సాగులో ఉన్నప్పుడు వివిధ రకాల పురుగులు, తెగుళ్లు ఆశిస్తాయి. ఈ పురుగుల జీవిత చక్రంలో పంటకు నష్టం కలుగజేసేవి లార్వాలు, తల్లి పురుగులు మాత్రమే. ఈ చీడపీడల లార్వాలు, తల్లి పురుగులుగా మారే క్రమంలో కోశస్థ దశ(ప్యూపా)కు చేరుకుంటాయి. ఈ కోశస్థ దశలో పంటలకు ఎలాంటి నష్టం కలుగజేయవు. సాధారణంగా పొలంలో పంట లేనప్పుడు, వేసవిలో భూమి ఖాళీగా ఉంటుంది. ఈ చీడపీడలకు కూడా ఆహారం లభ్యం కాక, కోశస్థ దశల్లో కానీ, సుప్తావస్థ దశల్లో కానీ ఇతర కలుపు మొక్కలపై ఆశ్రయం పొందుతూ ఉంటాయి. వేరుశనగ, చెరకు, పండ్ల చెట్లను ఆశించే వేరు పురుగులు, అపరాలు, కంది, పత్తి తదితర పంటలను ఆశించే పచ్చ పురుగు, లద్దెపురుగు, బొంత పురుగు, దాసరి పురుగు కోశస్థ దశలు భూమిలోనే ఉంటాయి. వరిని ఆశించే కాండం తొలుచు పురుగు కోశస్థ దశలు, వరి కోసిన దుబ్బుల్లోనే ఉంటాయి. వరిని, ఇతర పంటలను ఆశించే మిడత పురుగులు నేలలో 5 సెంటీమీటర్ల లోతులో గుడ్లు పెడతాయి. ఇవి పొలం గట్ల పక్కన గుడ్లు పెడతాయి. తొలకరి వర్షాలకు గుడ్ల నుంచి పిల్ల పురుగులు బయటకు వస్తాయి. ఇంకా ఇతర తెగుళ్లను వ్యాప్తి చేసే అనేక శిలీంధ్రాలు కూడా భూమిలో ఆశ్రయం పొందుతుంటాయి. వేసవిలో లోతు దుక్కులు చేపట్టడం వల్ల భూమిలో దాగి ఉన్న చీడపీడల కోశాలు, గుడ్లు, ఇతర శిలీంధ్ర జాలాలు కూడా బయటపడి అధిక ఉష్ణోగ్రతల ద్వారా నశిస్తాయి. భూమిపై బయట పడిన ప్యూపాలను, గుడ్లను కొంగలు, కాకులు తిని నాశనం చేస్తాయి. దుక్కి దున్నేటప్పుడు, మనుషులు, పశువుల తొక్కిసలాటలో కొన్ని పురుగులు, ప్యూపాలు చనిపోతాయి. సమగ్ర సస్యరక్షణలో వేసవి లోతు దుక్కులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. తద్వారా పురుగు, తెగుళ్ల మందు ఖర్చు కొంతవరకు తగ్గుతుంది. వాతావరణ కాలుష్యం కూడా తగ్గుతుంది.

లోతైన దుక్కులతో భూసారం మెరుగు

- ఎఒ అశోక్ కుమార్ రెడ్డి, ఆదోని

రైతులు వేసవి వెళ్లకముందే లోతైన దుక్కులు దున్నాలి. పొలానికి అడ్డంగా దున్నడంతో భూమిలోని చీడపురుగులు నశించిపోతాయి. తగినంత తేమ ఉన్నప్పుడు దుక్కులు వాలుగా లోతుగా దున్నితే నేలకోతకు గురవకుండా ఉంటుంది. దున్నిన తర్వాత రైతులు పంటల సాగుకు వేపగింజల మిశ్రమాన్ని చేనులో పిచికారి చేయాలి. క్రిమికీటకాలు పంటను ఆశించవు. క్రిమి సంహారక మందులు వాడకుండా ఉండడమే మంచిదని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న ఎస్ఐ తిమ్మయ్య

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - నందవరం

అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని నాగలదిన్నె చెక్ పోస్ట్ దగ్గర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఎస్ఐ తిమ్మయ్య మాట్లాడారు. టి.సోమాల గూడూరు గ్రామానికి చెందిన కురువ రాజు కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా నాగలదిన్నె చెక్ పోస్ట్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. 245 జాన్స్ ఒరిజినల్ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు, ఒక మోటార్ సైకిల్ స్వాధీనంలోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా మద్యాన్ని తరలించాలని ప్రయత్నం చేసినా, అక్రమ మద్యాన్ని అమ్మినట్లు తెలిసినా వారిపై కేసు నమోదు చేసి, జైలుకు పంపుతామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలోని బంబం స్వామి దర్గా దగ్గర గురువారం కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ తెలిపారు. చిప్పగిరికి చెందిన చెరువు రాముడు వద్ద ఉన్న ఒక తెల్ల సంచిలో కర్ణాటక మద్యం ఉన్నట్లు కనుక్కొని పట్టుకుని, అతనిని అరెస్టు చేశామని చెప్పారు. ఉదయమే బంబం స్వామి దర్గా దగ్గరకు సిబ్బందితో కలిసి వెళ్లానని తెలిపారు. అక్కడ చెరువు రాముడు తన చేతిలో ఉన్న సంచిలో వెతికితే కర్ణాటకకు టెట్రా ప్యాకెట్లు, 90 హేవర్డ్స్ చీర్స్, 650 ఎంఎల్ బాటిళ్లు ఉండడంతో స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. పోలీసులు యశ్వంత్, షబ్బీర్ బాష, భాస్కర్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

C.Jainastrina
W/o B.Suresh Babu,
R/o H.No.15-121-1B,
IndiraGandi Nagar, Veldurthi (V&M),
Junior Asst.Z.P.H.School, Goverdhanagiri,
Veldurthi (M) Kurnool Dist.

నా క్లయింటు అయిన C.Jainastrin 09-05-2024వ తేదిన ఇంటి నుండి బస్టాండుకు ఆటోలో ప్రయాణం చేయుచుండగా స్టేట్ బ్యాంకు,వెల్దుర్తి బ్రాంచికి చెందిన మొదటిచెక్కు బుక్‌లోని సీరియల్ నెం.872626 నుండి 872675,అలాగే రెండవ చెక్కు బుక్‌లోని సీరియల్ నెం.635881నుండి 635930, అలాగే మూడవ చెక్కు బుక్‌లోని సీరియల్ నెం.939761నుండి 939810, ఆటోలో పడిపోయాయి. పైన కనబడిన చెక్కులకు చెందిన లీవ్స్ ఎవరికైన దొరికినచో నా క్లయింటు అయిన C.Jainastrina కుగాని క్రింద కనబరచిన నా అడ్రస్‌కుగాని తెచ్చి ఇవ్వగలరని మనవి.ఒకవేళ పై చెక్కులు ఎవరికైన దొరికిన వాటిపైన ఎలాంటి లావాదేవీలు చెల్లవని తెలియజేయడమైనది. చెక్కులు ఎవరైన వ్రాసుకొని నా క్లయింటుపై చెక్కు బౌన్స్ కేసులు దాఖలు చేస్తే అవి చెల్లవని అలాంటి వారిపై తగిన సివిల్ మరియు క్రిమినల్ కేసులు దాఖలు చేయడం జరుగుతుంది.

సి. విజయ్‌కుమార్,
అడ్వకేటు,
నందికొట్కూరు టౌన్,
నంద్యాల జిల్లా,
మొబైల్ నెం.9989884402